### సమస్య ఉన్నదంటే పట్టించుకుంటలే..



అధికారులకు ఏదైనా చెప్పాలంటే భయమైతుంది. అంతలా రైతులను భయభ్రాంతులకు గురిజేస్తుండ్రు. నిర్మల్‌లో నాకున్న రెండు ఎకరాల్లోటమాట పంట వేశా. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే ఎవరూ రాలే. పంట ఎండిపోయి రూ.8 లక్షలు నష్టపోయిన. ఇయ్యాళ సమస్య ఉన్నదంటే అధికారులు పది రోజులకు అస్తుండ్రు. చార్జీలు పెంచుతామంటే ఎవరూ ఊర్కోరు.

**- ఆనంద్‌రావు, నిర్మల్ జిల్లా వాసి**

### పైసలిస్తేనే పని చేస్తున్నారు..



విద్యుత్ అధికారులు పైసలిస్తేనే పని చేస్తున్నారు. లేదంటే ఏ మూడు, నాలుగు నెలలకో చేస్తున్నారు. టోల్‌ఫ్రీ నంబర్ పని చేయదు. ఎవరికీ ఫోన్ చేసినా పట్టించుకోరు. అసలు ఫోన్లే ఎత్తరు. వ్యవసాయం కుప్పకూలితే గానీ వీళ్లకు అర్థం గాదు. చార్జీలు పెంచాలన్న ఆలోచన విరమించుకోవాలె.

**- విద్యాసాగర్‌రావు, రైతు**

### మధ్యతరగతి ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు



విద్యుత్ పంపిణీ సంస్థలు కష్టాల్లో ఉన్నాయని భారీగా విద్యుత్ బిల్లుల పేరుతో ప్రజలపై భారం మోపడం మంచిదికాదు. విద్యుత్ అనేది రాష్ట్ర అభివృద్ధితో ముడిపడిన అంశం. విద్యుత్ చార్జీలు పెంచాలంటూ డిస్కంలు చేసిన తొమ్మిది ప్రతిపాదనలను వెంటనే విరమించుకోవాలి.

**- డాక్టర్ బి.కేశవులు,**
**చైర్మన్, తెలంగాణ మేధావుల సంఘం**




బహిరంగ విచారణలో ఈఆర్‌సీ అధికారులు



హాజరైన ప్రజాప్రతినిధులు, వినియోగదారులు

## చార్జీల పెంపుతో
# పెనుభారం

- ప్రతిపాదలను ఉపసంహరించుకోవాలి
- మాజీ మంత్రి వేముల డిమాండ్
- నిజామాబాద్‌లో ఈఆర్‌సీ బహిరంగ విచారణ
- పెంపు ప్రతిపాదనలపై వెల్లువెత్తిన అభ్యంతరాలు
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టిన నేతలు, ప్రజలు
- పరిశ్రమలు మూతబడి ఉపాధి కోల్పోయే ప్రమాదం
- పదేండ్లలో కేసీఆర్ ఒక్కసారి పెంచలేదన్న ప్రశాంత్‌రెడ్డి


ఖలీల్‌వాడి, అక్టోబర్ 24 : విద్యుత్ చార్జీలు పెంచాలన్న ప్రభుత్వ ప్రయత్నాలపై తీవ్ర అభ్యంతరాలు, విమర్శలు వెల్లువెత్తాయి. విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) బహిరంగ విచారణలో.. పెంపు ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రూ.18,500 కోట్ల మేర విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపేందుకు ప్రభుత్వ డిస్కంలు ప్రతిపాదించడం సరికాదని, దీనివల్ల ప్రజలపై పెనుభారం పడుతుందని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సర్కారు ప్రయత్నాలను అడ్డుకోవాలని ఈఆర్‌సీకి విన్నవించారు. ప్రభుత్వ విద్యుత్ డిస్కంలు ప్రతిపాదించిన కరెంట్ చార్జీల పెంపు ప్రతిపాదనలపై ఈఆర్‌సీ గురువారం నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ చేపట్టింది. ఈఆర్‌సీ చైర్మన్ తన్నీరు శ్రీరంగరావు, సభ్యులు మనోహర్‌రాజు, కృష్ణయ్య ప్రజల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ సహా వివిధ పార్టీల నేతలు, సంఘాల నాయకులు, సామాన్య ప్రజలు తమ అభ్యంతరాలను లేవనెత్తారు. చార్జీల పెంపు ప్రతిపాదనలను తీవ్రంగా వ్యతిరేకించారు. మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే వీజీగౌడ్, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు బహిరంగ విచారణలో పాల్గొన్నారు.

### భారం సరికాదన్న వేముల

కాంగ్రెస్ ప్రభుత్వం రూ.18,500 కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపేందుకు సిద్ధమైందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. రూ. 963 కోట్ల ట్రూ అప్ చార్జీలు, రూ.16,364 కోట్ల విద్యుత్ చార్జీలు, ఈ ఆర్థిక సంవత్సరానికి గాను 1,200 కోట్ల విద్యుత్ చార్జీల పెంపు కోసం విద్యుత్ సంస్థలు పిటిషన్లు దాఖలు చేశాయని, వాటిని వెంటనే తిరస్కరించాలని ఈఆర్‌సీకి విజ్ఞప్తి చేశారు. ఇళ్లకు వాడుకునే కరెంట్ నెలకు 300 యూనిట్లు దాటితే కిలోవాట్‌కు ప్రస్తుతం వసూలు చేస్తున్న రూ.10 ఫిక్స్‌డ్ ఛార్జీని రూ.50కి పెంచాలని డిస్కంలు కోరటం సరికాదన్నారు. ఎండాకాలంలో 300 యూనిట్ల విద్యుత్ వినియోగం సాధారణమైందని, చార్జీల పెంపు వల్ల మధ్య తరగతి ప్రజలపై ప్రతి నెలా వేలాది రూపాయల భారం పడుతుందన్నారు.

### కేసీఆర్ పాలనలో చార్జీలు పెంచలే..

విద్యుత్ రంగంలో ఎన్నో అవరోధాలను ఎదుర్కొని కేసీఆర్ విజయాలు సాధించారని ప్రశాంత్‌రెడ్డి గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడితే తెలంగాణ అంధకారం అవుతుందన్న విమర్శలకు.. దేశంలో ఎక్కడా లేని విధంగా 24 గంటల కరెంట్ ఇచ్చి అవన్నీ తప్పుడు ఆరోపణలని నిరూపించారన్నారు. రైతాంగానికి 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌తో పాటు పారిశ్రామిక రంగానికి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేశామన్నారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు 7 వేల మెగావాట్లు మాత్రమే ఉన్న విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని కేసీఆర్ 24 వేల మెగావాట్లకు తీసుకెళ్లారని చెప్పారు. నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లను ఆధునీకరణకు ఎంత ఖర్చైనా వెనుకాడలేదని, ప్రజలపై భారం అసలే మోపలేదని ప్రశాంత్‌రెడ్డి గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలోనూ డిస్కంలు విద్యుత్ చార్జీల పెంపును ప్రతిపాస్తే ఆయన అంగీకరించలేదన్నారు.



బహిరంగ విచారణలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల

### పరిశ్రమలు వెనక్కి..

పరిశ్రమలకు సంబంధించిన డిస్కంలు చేసిన ప్రతిపాదనలు ఆశ్చర్యంగా, అభివృద్ధి నిరోధకంగా ఉన్నాయని వేముల అసంతృప్తి చేశారు. చిన్న పరిశ్రమలకు, భారీ పరిశ్రమలకు ఇచ్చే కరెంట్‌కు ఒకే విధమైన రేటు చెల్లించాలనడం సమంజసం కాదన్నారు. ఇలాగైతే సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమలకు ఉరి వేస్తున్నట్లేనన్నారు. ఈ నిర్ణయం కారణంగా చిన్న పరిశ్రమలు మూతబడి లక్షల మంది ఉపాధి కోల్పోతారని తెలిపారు. పరిశ్రమలన్నింటినీ ఒకే గాటన కట్టడం వల్ల సిరిసిల్ల, కాటేదాన్ సహా చాలా ప్రాంతాల్లో ప్రభుత్వం ఇచ్చే విద్యుత్ సబ్సిడీలు బందయ్యే పరిస్థితి ఉంటుందన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలతో పారిశ్రామిక రంగంలో మందగమనం మొదలైందన్నారు. చాలా కంపెనీలు రాష్ట్రాన్ని వీడి వెళుతున్నాయని, ఫాక్స్‌కాన్ లాంటి సంస్థ తన కంపెనీ విస్తరణను విరమించుకుందని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో పరిశ్రమలను కాపాడుకోవటానికి వీలైనంత వరకు ప్రోత్సాహకాలు ఇవ్వాల్సి ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న పరిశ్రమలు కూడా ఆగమయ్యేలా విద్యుత్ చార్జీలను పెంచాలని ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు. 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అంటూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, దాన్ని ఎలా అమలు చేయాలో తెలియక అసంబద్ధ నిర్ణయాలు తీసుకుంటున్నదని, చార్జీల పెంపునకు యత్నిస్తున్నదని దుయ్యబట్టారు. ఉచిత విద్యుత్ భారాన్ని మధ్యతరగతి, చిన్నపరిశ్రమలు, భారీ పరిశ్రమలపై వేయాలని ఆలోచిస్తున్నదని, తద్వారా రాష్ట్ర అభివృద్ధి కుంటుపడే ప్రమాదముందని హెచ్చరించారు. డిస్కంలు ప్రతిపాదించిన 9 ప్రతిపాదనలను తిరస్కరించాలని విజ్ఞప్తి చేశారు.




మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

## కొబ్బరికాయలు కొట్టారు.. ఫొటోలకు ఫోజులిచ్చారు..

- జిల్లాలో నామమాత్రంగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- ఇప్పటివరకూ రైస్‌మిల్లులకు అలాట్‌మెంట్ లేదు..
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం

ఖలీల్‌వాడి, అక్టోబర్ 24: జిల్లాలో నామమాత్రంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు కొబ్బరి కాయలు కొట్టి, ఫొటోలకు ఫోజులిచ్చి చేతులు దులిపేసుకున్నారని విమర్శించారు. జిల్లా కేంద్రంలో గురువారం 'క్రాస్ సబ్సిడీ సర్ చార్జీల'పై నిర్వహించిన బహిరంగ విచారణకు హాజరైన అనంతరం వేముల విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్షాలు డిమాండ్ చేయడంతోనే తూతూ మంత్రంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారని తెలిపారు. కేంద్రాలకు ఇప్పటివరకు రైస్‌మిల్లులను కేటాయించలేదన్నారు. రైతులు కల్లాలు, కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం ఆరబోసుకుంటున్నారని, అకాల వర్షాలకు తడిసిపోతుందన్నారు. కేంద్రాలను ఏర్పాటు చేసి రోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో దళారులకు అమ్ముకునే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ. 2300 ఉంటే, రైతు భరోసా కింద బోనస్ రూ. 500 కలుపుకొని రైతుకు రూ. 2800 రావాలన్నారు. కానీ కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులు దళారులకు రూ.2100 అమ్ముకొని రూ.700 నష్టపోతున్నారని తెలిపారు. గత పదేండ్ల కాలంలో రైతులు ఏనాడూ దళారులకు ధాన్యం అమ్ముకోలేదని గుర్తుచేశారు. కేసీఆర్ సర్కార్ హయాంలో కొనుగోలు కేంద్రాల్లో విక్రయించారని తెలిపారు. రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవడం ఇదే మొదటిసారి అని, ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన మార్పు అని ప్రశ్నించారు. పంట కొనుగోలు చేయడంలో రేవంత్‌రెడ్డి సర్కార్ ఘోరంగా విఫలమైందన్నారు. రైతులను దళారులు మోసం చేస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. గతంలో ఇలాంటి ఘటనలు ఎన్నో జరిగాయన్నారు. వరికి బోనస్ రూ.500 ఎగ్గొట్టడానికే ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లపై జాప్యం చేస్తున్నదని ఆరోపించారు.అగ్రికల్చర్ పోర్టల్‌లో ప్రతిరైతు పండించిన పంట లెక్కలు ఉన్నాయని తెలిపారు. దళారులకు అమ్మిన రైతులకు కూడా ఎకరానికి 26 క్వింటాళ్లతో లెక్కవేసి ప్రతి క్వింటాలుకు అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### మోస్రాలో బీఆర్‌ఎస్ ఆందోళన




మోస్రాలో నిరసన చేపడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

చందూర్, అక్టోబర్ 24: రాష్ట్ర ప్రభుత్వం ఈ సీజన్ రైతు భరోసాను ఎగ్గొట్టడంపై బీఆర్‌ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు వారు మోస్రా మండల కేంద్రంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల గురించి పట్టించుకోవడంలేదన్నారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ అన్నదాతలను నిండా ముంచిందన్నారు. రైతు భరోసా వెంటనే విడుదల చేసి, రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు పాల్గొన్నారు.





## కేటీఆర్‌కు ఘనస్వాగతం

బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదిలాబాద్‌లో గురువారం నిర్వహించిన రైతుధర్నాకు వెళ్తుండగా.. మార్గమధ్యంలో కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం పొందుర్తి, నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. కేటీఆర్‌కు స్వాగతం పలికిన వారిలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, బీఆర్‌ఎస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, స్థానిక నాయకులు ఉన్నారు.

# పోలీసులా.. కూలీలా?

- ఉద్యోగమంటే గడ్డి తీయడం, రాళ్లు ఎత్తడమా?
- బెటాలియన్ పోలీసు కుటుంబాల ఆగ్రహం
- చంటిపిల్లలతో జాతీయ రహదారిపై బైఠాయింపు
- ఒకే రాష్ట్రం–ఒకే పోలీసు విధానం కావాలని డిమాండ్
- మద్దతు తెలిపిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

డిచ్‌పల్లి, అక్టోబర్ 24: వెట్టిచాకిరిని వ్యతిరేకిస్తూ ఏడో బెటాలియన్‌కు చెందిన పోలీసు కుటుంబాలు రోడ్డెక్కాయి. చంటిపిల్లలతో ఎండలో 44వ జాతీయ రహదారిపై బైఠాయించాయి. తమ భర్తలతో వెట్టి చాకిరి చేయిస్తున్న వైనాన్ని ఎండగడుతూ కానిస్టేబుళ్ల భార్యలు, పిల్లలు గురువారం రాస్తారోకో చేపట్టారు. డిచ్‌పల్లి శివారులోని బెటాలియన్‌కు ఎదురుగా ఉన్న హైవేపై పిల్లాపాపలతో రెండు గంటలకు పైగా ఎండలో ఆందోళన కొనసాగించారు. మావాళ్లు పోలీసులా.. కూలీలా? వాళ్లు ఉద్యోగం చేయడమంటే గడ్డి తీయడం.. రాళ్లు ఎత్తడమేనా? ఒక్కొక్కరిని ఒక్కోలా చూడడం సరికాదంటూ నినదించారు. ఒకే రాష్ట్రం–ఒకే పోలీసు విధానం అమలుచేయాలని డిమాండ్ చేశారు.

#### పిల్లలు గుర్తు పట్టడం లేదు..

బెటాలియన్‌లో పని చేసే తమ భర్తలు వెట్టిచాకిరి చేస్తున్నారని, బెటాలియన్‌లో గడ్డి తీయిస్తున్నారని, రాళ్లు మోయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భర్తలు నెలలో 4 రోజులు మాత్రమే ఇంటికి వస్తున్నారని, దీంతో పిల్లలు తమ తండ్రిని కూడా గుర్తు పట్టలేని స్థితిలో ఉన్నారని వాపోయారు. బెటాలియన్ పోలీసులకు ఐదేండ్లు ఒకే దగ్గర పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూడు నెలలకొకసారి పోస్టింగ్‌లు మార్చడంతో పిల్లల చదువులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయన్నారు. సెలవుల విధానం మార్చాలని, పని భారం తగ్గించాలన్నారు. ఒకే పోలీస్ విధానం అమలు చేయాలన్నారు. విధి నిర్వహణ పేరుతో ప్రభుత్వం పోలీసులను వారి కుటుంబాలకు దూరం చేయడం సరికాదని తెలిపారు.

#### పక్కకు తోసేసిన పోలీసులు..

రాస్తారోకో సమాచారం అందుకున్న డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, ఎస్సైలు షరీఫ్, సత్యం సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకున్నారు. సమస్యలుంటే బెటాలియన్ లోపల నిరసన తెలుపాలని, రాకపోకలకు ఇబ్బందులు కలిగించొద్దని సముదాయించగా, మహిళలు పట్టువీడలేదు. జిల్లా అడిషనల్ ఎస్పీ (లా అండ్ ఆర్డర్) బస్వారెడ్డి బెటాలియన్‌కు చేరుకుని రహదారిపై నుంచి పక్కకు వెళ్లాలని అందోళన చేస్తున్న వారిని హెచ్చరించారు. అయినా వారు శాంతించకపోవడంతో మహిళలను బలవంతంగా తరలించారు. మరోవైపు, బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ నచ్చచెప్పేందుకు యత్నించారు. బెటాలియన్ సమావేశం హాల్‌కు వెళ్లి మాట్లాడుకుందామని చెప్పగా, ఆందోళన విరమించేందుకు నిరాకరించారు.

#### మద్దతు తెలిపిన కేటీఆర్

పోలీసు కుటుంబాల ఆందోళనకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మద్దతు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వెళ్తున్న ఆయన.. విషయం తెలుసుకొని పోలీసు కుటుంబాలతో మాట్లాడారు. ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి బెటాలియన్ సిబ్బంది సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు. 'ఇలాగే వేరే బెటాలియన్‌లో కానిస్టేబుళ్ల కుటుంబీకులు ధర్నా చేస్తే కొందరు కానిస్టేబుళ్లను ప్రభుత్వం సస్పెండ్ చేసింది.. ఇక్కడా అలాగే చేస్తే మీరేం చేస్తారని' కేటీఆర్ ప్రశ్నించారు. మా సమస్యను ప్రభుత్వానికి తెలియజేసే హక్కు మాకు లేదా..? మా భర్తలను సస్పెండ్ చేస్తే హైదరాబాద్ వెళ్లి మరీ ధర్నా చేస్తామని మహిళలు స్పష్టంచేశారు. సమస్య పరిష్కారం కోసం బీఆర్‌ఎస్ తరపున పోరాడతామని, ధర్నా విరమించాలని సూచించి, కేటీఆర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆయన వెంట ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, జాజాల సురేందర్, బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, బాజిరెడ్డి జగన్ తదితరులున్నారు.



రాస్తారోకో చేస్తున్న పోలీసుల కుటుంబీకులను బెటాలియన్‌కు తరలిస్తున్న డిచ్‌పల్లి పోలీసులు



పోలీసు కుటుంబాలతో మాట్లాడుతున్న కేటీఆర్




# పర్సన్ ఇన్‌చార్జీల నియామకం చెల్లదు

- బస్వాపూర్, కాచాపూర్ విండోలపై హైకోర్టు తీర్పు
- గెజిట్ నోటిఫికేషన్ లేనందున బస్వాపూర్ సొసైటీ రద్దు
- పీఏసీఎస్ చైర్మన్ ఎన్నికకు మార్గం సుగమం

భిక్కనూర్, అక్టోబర్ 24: భిక్కనూర్ మండలంలోని కాచాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పునర్విభజనను హైకోర్టు రద్దు చేసింది. కాచాపూర్, బస్వాపూర్ పీఏసీఎస్‌లకు నిబంధనలకు విరుద్ధంగా పర్సన్ ఇన్‌చార్జీలను నియమిస్తూ కామారెడ్డి జిల్లా సహకార అధికారి జారీ చేసిన ఉత్తర్వులను రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. గెజిట్ నోటిఫికేషన్ లేకుండా బస్వాపూర్ పీఏసీఎస్‌గా గుర్తించడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొంది. ఈ అంశంపై హైకోర్టులో గురువారం వాదోపవాదాలు జరిగాయి. ప్రభుత్వ న్యాయవాది, పిటిషనర్ల తరపున న్యాయవాదుల అభ్యంతరాలను హైకోర్టు సునిశితంగా పరిశీలించింది. సహకార చట్టంలోని నిబంధనల మేరకు గెజిట్ నోటిఫికేషన్ లేకుండా బస్వాపూర్ సొసైటీ మనుగడ సాధించలేదని తేల్చిచెప్పింది. ఈ మేరకు పునర్విభజనను రద్దు చేసి పాత పద్ధతి మేరకు కాచాపూర్ సొసైటీ మాత్రమే మనుగడలో ఉంటుందని హైకోర్టు తీర్పు చెప్పింది. దీంతోపాటు పర్సన్ ఇన్‌చార్జీలుగా మల్లారెడ్డి, కృష్ణాగౌడ్ నియామకం చెల్లదని పేర్కొంది.

#### హైకోర్టు తీర్పుతో కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద షాక్..

కాచాపూర్ సొసైటీ పునర్విభజనను హైకోర్టు కొట్టివేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్దషాక్ తగలినట్లయ్యింది. కోర్టు తీర్పు నేపథ్యంలో పాత సొసైటీ పాలకవర్గం పదవీకాలం మేరకు 2025, ఫిబ్రవరి వరకు కొనసాగనున్నది. హైకోర్టు ఆదేశాలతో త్వరలోనే కాచాపూర్ పీఏసీఎస్ చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.